ఆంధ్రజ్యోతి




ANDHRAJYOTHY 5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 12 సెప్టెంబరు 2025

నౌకరిపై నల్లసూరీల నిర్లక్ష్యం



భూపాలపల్లి సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం



- తరచూ గైర్హాజరవుతున్న యువ కార్మికులు
- గతంలో ఏరియాలో 48 మంది కార్మికుల డిస్మిస్..
- తాజాగా మరో 50 మందికి షోకాజ్ నోటీసుల జారీ
- 425 మంది.. 100 మస్టర్ల కంటే తక్కువగా విధులకు హాజరు
- విధులకు హాజరు కాకుంటే రాం.. రాం అంటున్న యాజమాన్యం



గైర్హాజరైన కార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు (ఫైల్)

కృష్ణకాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో ఉద్యోగాల్లో చేరిన యువత నిత్యం విధులకు ఎగనామం పెడుతున్నారు. సింగరేణి ఉద్యోగాలు చేస్తే తమ పిల్లల బతుకులు బాగుపడుతాయనే ఆశతో మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ అయిన కార్మికులు వారివారి పిల్లలకు ఉద్యోగాలు పెట్టించారు. ఆర్థికంగా నిలదొక్కుకొని, ఉన్నత చదువులు చదివించుకొని అటు సింగరేణికి.. తమకు మంచి పేరు తెస్తారని ఆశపడిన తల్లిదండ్రుల ఎదురుచూపులకు నిరాశ ఎదురవుతోంది. కారణాలు లేకుండా చాలా మంది యువ కార్మికులే విధులకు ఎగనామం పెడుతూ నోటీసులు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం తరచూ గైర్హాజరయ్యే కార్మికులపై నజర్ పెట్టింది. అలాంటి వారిని గుర్తించి కుటుంబీకుల సమక్షంలో సైతం కౌన్సెలింగ్‌లు చేపడుతోంది. అయినప్పటికీ మారని తీరుతో వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. చేజేతులారా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితిలోనే చాలా మంది ఉండడంతో వారివారి తల్లిదండ్రుల్లో ఆవేదన వ్యక్తమ వుతోంది.

గతం కంటే ఎంతో మేలు..

సింగరేణిలో ఉద్యోగాలు చేయడం ఒకప్పటితో పోల్చుకుంటే ఎంతో మేలు అనే చెప్పుకోవచ్చు. ఆనాడు చేసిన పనికి నేడు చేస్తున్న పనికి చాలా వ్యత్యాసాలు ఉన్నాయనేది వాస్తవం. అయినప్పటికీ చాలా మంది యువ కార్మికులు కారణాలు లేకుండా విధులకు డుమ్మా కొట్టడం విస్మయం కలిగిస్తుందంటున్నారు. భూగర్భ గనుల్లో పనులు చేయడం అప్పట్లో కష్టంగా ఉండేదని, ప్రస్తుతం ప్రతి మైన్‌ను మిషన్ మైనింగ్‌గా మార్చామని, యంత్రాలతోనే బొగ్గు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ కార్మికులు గైర్హాజరవడం అంతుచిక్కడం లేదంటున్నారు. మరోవైపు అండర్‌గ్రౌండ్‌లు, ఓసీల్లో ప్రమాదా ల జరగకుండా పూర్తి రక్షణ ఏర్పాట్లు ఉన్నాయి. గాలి, నీరు సక్రమంగా వచ్చేలా చేస్తున్నప్పటికీ గైర్హాజరు మాత్రం తగ్గడం లేదు. పైగా కారుణ్య నియామకాల్లో ఎక్కువగా ఉన్నత చదువులు చదివిన యువతే ఉన్నారు. వీరిలో డీగ్రీలు, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్ చేసిన వారితో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసిన వారు కూడా ఆ ఉద్యోగాలను వదులుకొని వారసత్వంగా వచ్చిన ఈ సింగరేణి నౌకరి చేసేందుకు ముందుకు వచ్చారు. కానీ, విధుల నిర్వహణలో మాత్రం వారి వ్యవహార శైలి తల్లిదండ్రులతో పాటు అధికారులను ఇబ్బందులకు గురి చేస్తోంది.

100లోపు వారు 425 మంది..

భూపాలపల్లి సింగరేణి ఏరియాలో 4 అండర్ గ్రౌండ్ మైన్‌లు, రెండు ఓసీలు ఉన్నాయి. వీటిల్లో ఏరియా మొత్తంగా 5300 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో గతంలో నుండి సంస్థలో పని చేస్తున్న సీనియర్ కార్మికులు సరిగ్గానే విధులకు హాజరవుతున్నారు. కానీ, కారుణ్య నియామకాల్లో భాగంగా విధుల్లో చేరిన యువ కార్మికులే విధులు చేసేందుకు విముఖత చూపుతున్నారు. ఏరియాలో 100 మస్టర్ల కంటే తక్కువగా విధులకు హాజరైన వివిధ గనుల్లోని 425 మంది కార్మికులను సింగరేణి అధికారులు గుర్తించా రు. వారందరిని సరి చేసే పనిలో నిమగ్నమైనా అధికారులు సూచనలను పెడచెవిని పెడుతున్నట్లుగా తెలుస్తోంది.

48 మంది డిస్మిస్.. 50 మందికి షోకాజ్

భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో ఇప్పటి వరకు 48 మంది కార్మికులు ఉద్యోగాల్ని కోల్పోయారు. ప్రస్తుతం వారంతా మళ్లీ తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలంటూ సింగరేణి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. గడిచిన ఆరేళ్లలో 42 మంది కార్మికులు డిస్మిస్ అయితే, 2023, 2024, 2025 సెప్టెంబరు నాటికి ఆరుగురు కార్మికులు డిస్మిస్ అయ్యారు. తాజాగా ఇటీవల కాలంలో తరచూ గైర్హాజరవుతున్న యువ కార్మికులు 50 మందికి సింగరేణి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నెల రోజుల్లో గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి వారి వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకొనుటకు అధికారులు సన్నద్ధంగా ఉన్నారు.

యాజమాన్యం ప్రత్యేక నజర్..

సింగరేణి ఏరియాలో కార్మికుల గైర్హాజర్‌పై సింగరేణి జీఎంతో పాటు (మిగతా 8వ పేజీలో)

కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల నిర్మాణంలో జాప్యం చేసే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్, టీజీఎంఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల నిర్మాణం, వైద్యసిబ్బంది సమయపాలన, ఖాళీల భర్తీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవ =నాల నిర్మాణంలో జాప్యం చేస్తే ఉపక్షేపించవద్దని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని స్పందించకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. క్రిటికల్ కేర్ నిర్మాణంలో జాప్యం జరుగుతుందని కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండు నోటీసులు ఇవ్వడం జరిగిందని మళ్లీ నోటీసులు ఇవ్వాలన్నారు. జీజీహెచ్ గోడలపై గుట్కా, ఉమ్మి వేస్తున్నారని దాని వల్ల ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంటుందన్నారు. వైద్య సేవలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పరిశుభ్రత పాటించాలన్నారు. మహాదేవ్‌పూర్ సీహెచ్‌సీలో ప్రసూతి సేవలకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, జీజీహెచ్ సూపరిటెండెంట్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కొండాపూర్‌లో అంతర్గతరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గణపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు రాకపోకలు సులభతరం చేసేవిధంగా అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్, రంగారావుపల్లి, సీతారాంతపురం, బంగ్లాపల్లి, వీర్లపల్లి గ్రామాల్లో పర్యటించి గ్రామాలను కలిపే అంతర్గత రోడ్ల అభివృద్ధికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. అభివృద్ధి పట్టణాలకే పరిమితం కాకుండా పల్లెల్లో కూడా సమానంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మీ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, నాయకులు రాజేందర్, చోటేమియా, కుమార్, అశోక్, శివ శంకర్, కట్కూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేయండి..

- కాజీపేటలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వండి..
- భూపాలపల్లికి రైల్వేస్టేషన్, కొత్త లైను నిర్మించండి..
- రైల్వే బైపాస్ లైన్లకు ప్రత్యామ్నాయం చూపండి..
- రైల్వే అధికారులకు ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి

7

ములుగు జిల్లాలో సగటు 29.3 సె.మీ వర్షపాతం నమోదు

అత్యధికంగా తాడ్వాయి మండలంలో 8.50 సె.మీలు

ములుగు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సగటు వర్షపాతం 29.3 సెంటీమీటర్లు నమోదయినట్లు జిల్లా వాతావరణశాఖ అధికారులు తెలిపారు. జిల్లా మొత్తంగా 2.93 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు ప్రకటించారు. అత్యధికంగా తాడ్వాయి మండలంలో 8.50 సెంటీమీటర్లు నమోదు కాగా వాజేడులో 4.92 సెంటీమీటర్లు, కన్నాయిగూడెం మండలంలో 4.86, ఏటూరునాగారంలో 3.20, వెంకటాపురం మండలంలో 1.86, గోవిందరావుపేటలో 1.52, వెంకటాపూర్ మండలంలో 0.64 , ములుగు మండలంలో 0.48 సెంటీమీటర్లు, అత్యల్పంగా మంగపేటలో 0.42 సెంటీ మీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. కాగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 0.25 సెంటీ మీటర్ల సగటు వర్షపాతం నమోదయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2.46 సెంటీమీటర్ల వర్షం కురిసి నట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలంలో 1.9 సెంటీమీట ర్లు, జేడీ.మల్లం పల్లి మండలంలో 0.45 సెంటీమీటర్లు, వాజేడు మండలంలో 0.08 సెంటీమీటర్లు, వెంకటాపూర్ మండలంలో 0.03 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు.

చిట్యాలలో శాస్త్రవేత్తల పర్యటన

చిట్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైలాపూర్, ఎలేటిరామయ్యపల్లి శివారులో వరి, పత్తి, మిరప పంటలను వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటలో వడల తెగులు, గులాబీరంగు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. వీటి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్‌మందుల పిచికారీతో పాటు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రవేత్తలు వెంకట రాజుకుమార్ ఉన్నారు.

ఈ గోస తీరేదెన్నడు..?

- యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- పంటలు దెబ్బతింటాయని ఆవేదన



రైతులకు కూపన్లు అందిస్తున్న డీఏవో బాపురావు, ఏడీఏ శ్రీపాల్

చిట్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గత పది రోజులుగా గ్రోమోర్, ఆగ్రోస్, ఓడీసీఎంఎస్, రైతు ఉత్పత్తిదారుల కేంద్రాలు, ఎరువుల విక్రయ షాపుల ఎదుట యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. గురువారం చిట్యాల మండలంలోని ఒడితల, చిట్యాల మండల కేంద్రంలోని రెండు కేంద్రాలకు యూరియా బస్తాలు రాగా ఆయా కేంద్రాల ఎదుట వందల సంఖ్యలో రైతులు బారులు తీరారు. బ్లాక్ మార్కెట్‌లో సైతం యూరియా లభించకపోవడంతో పంటల్లో ఎదుగుదల ఆగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

డీఏవో ఆధ్వర్యంలో కూపన్లు పంపిణీ

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ క్లస్టర్ రైతువేదిక వద్ద గురు వారం వర్షంలో సైతం యూరియా బస్తాల కోసం రైతులు అధికంగా తరలివచ్చారు. రైతువేదికల్లో యూరియా బస్తాల పంపిణీ తొలిసారిగా జరుగుతుండగా ఉదయం 6.30 గంటల నుంచి రైతులు భారీ సంఖ్య లో వచ్చి తమ చెప్పులను రైతు వేదిక ఎదుట లైన్‌లో పెట్టారు. రైతు వేదిక వద్దకు జిల్లా వ్యవసాయాధికారి బాపురావు, ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ చేరుకుని తమ ఏఈవోలు, పీఏసీఎస్ సిబ్బందితో కూపన్లు రాయించి బస్తాలను పంపిణీ చేశారు. లారీలో 220బ స్తాలు రాగా భారీ వర్షం కురియడంతో పంపిణీలో గందర గోళం నెలకొంది. వర్షం వెలిసిన అనంతరం ఒక్కో రైతుకు 1 బస్తా చొప్పున అందించారు. అనంతరం దామెరకుంట రైతు వేదిక వద్ద సైతం (మిగతా 8వ పేజీలో)



ఒడితలలో యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు


మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

చత్తీస్‌గఢ్ దంతెవాడ అడవుల్లో ఘటన

వివరాలు 6లో

● బొగత హొయలు

తెలంగాణ నయాగరా బొగత అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. పాలనురగ వలె పరవళ్లు తొక్కుతున్న ఆ ఆహ్లాద భరితాన్ని చూసేందుకు పర్యాట కులు, ప్రకృతి ప్రేమికులు పోటీ ప డుతున్నారు. జలపాతం హోయలొలుకుతూ ప్రవహిస్తున్న సుందర దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. కాగా ఆ ప్రకృతి దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. - వాజేడు (ఆంధ్రజ్యోతి)



సీఎం రేవంత్‌రెడ్డి రాకకు ఏర్పాట్లు

మేడారంలో హెలిప్యాడ్ సిద్ధం చేస్తున్న అధికారులు



హెలిప్యాడ్ వద్ద చెత్తను తొలగిస్తున్న కార్మికులు

తాడ్వాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మేడారంలో హెలిప్యాడ్, పారిశుధ్య పనులు, ప్రధాన రహదారుల తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అలాగే పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన శిలాఫలకాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, మహాజాతర ఏర్పాట్లను సీఎం స్వయంగా సందర్శించి పరిశీలిస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ నెల 9వ తేదీన జరిగిన మేడారం మహా జాతర సమీక్షలో ప్రకటించారు. అయితే సీఎం రాకకు ఇప్పటివరకు షెడ్యూల్ ఖరారు కాలేదు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీసీఎఫ్ ప్రభాకర్

మహదేవపూర్‌లో పర్యటించిన సీసీఎఫ్

మహదేవపూర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్ గురువారం మహదేవపూర్ డివిజనలో పర్యటించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని అటవీ కార్యాలయాల సముదాయంలో అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వారివెంట భూపాలపల్లి జిల్లా అటవీశాఖాధికారి నవీన్ రెడ్డి, ఎఫ్‌డీవో సందీప్ రెడ్డి, మండల అటవీ అధికారులు ఉన్నారు.

సొంతూరుకు చేరుకున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టర్



సాధించిన పతకాలతో వంశీ

వాజేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతమైన వాజేడుకు ఖ్యాతి తెచ్చిన ఆదివాసీ ఆణిముత్యం అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ మోడెం వంశీ స్వస్థలానికి చేరుకున్నాడు. గత నెలలో నార్త్ అమెరికాలో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో రెండు బంగారు పతకాలు సాధించిన వంశీ రాష్ట్రంలో వాజేడు పేరు మారుమోగేలా చేశారు. వంశీది వాజేడు మండలంలోని ఇప్పగుడెం గ్రామం కాగా. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటున్నారు. కొంత కాలం క్రితం భద్రాచలంలో ఓ నర్సరీలో పని నిమిత్తం వెళ్లగా అక్కడ ఆయన ప్రతిభను చూసిన కొందరూ జిమ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో ప్రతిభను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ ఏడాది ప్రారంభంలో మాల్టా దేశంలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించాడు. అనంతరం నార్త్ అమెరికాలో జరిగిన 65 కేజీల విభాగంలో సత్తాచాటి రెండు గోల్డ్ మెడల్స్ సాదించాడు. అమెరికా వెళ్లేందుకు ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే కాగా విరాళాలు, చందాలు ఇచ్చిన దాతల సహకారంతో వంశీ అమెరికాకు పయనమై తన సత్తా చాటాడు. బుధవారం రాత్రి స్వస్థలం ఇప్పగుడెంకు చేరుకున్న వంశీని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వీఆర్కేపురంలో దారుణం

మేనత్తను గొడ్డలితో నరికి హత్యచేసిన అల్లుడు



రక్తపు మడుగులో పడిఉన్న మృతురాలు ఎల్లమ్మ

వెంకటాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీఆర్కేపురంలో దారుణం జరిగింది. మేనత్తను అల్లుడు అతికిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే.. కొండగొర్ల ఎల్లమ్మ(65) కు చిన్న వయసులో పెళ్లయి భర్త వదిలేయడంతో వీఆర్కేపురంలోని తన తండ్రి వద్దనే ఉంటూ రోజువారీ కూలిపనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. మద్యానికి బానిస అయిన మేనల్లుడు కొండగొర్ల విజయ్ అత్తను కూలి డబ్బులు, బంగారం ఇవ్వాలంటూ గత మూడురోజులుగా గొడవ చేస్తున్నాడు. ఈక్రమంలో మద్యం మత్తులో ఉన్న విజయ్ గురువారం ఉదయం 8 గంటల సమయంలో అత్తను డబ్బులు అడగగా ఇవ్వలేదు. కొద్దిసేపటికి కూరగాయలు కొనడానికి ఇప్పలగూడెంలోని కిరాణాషాపునకు వెళ్తున్న ఎల్లమ్మను విజయ్ గొడ్డలితో తలపై అతికిరాతకంగా దాడిచేయగా తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి సోదరి బాడిస దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విజయ్‌ని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోక్సో చట్టం పై అవగాహన

జనగామ కల్చరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చౌడారం కేజీబీవీ విద్యార్థులకు పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. గురువారం జిల్లా జడ్జి బి.ప్రతిమ ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ విద్యార్థులకు పోక్సో చట్టం పై అవగాహన కల్పిస్తూ లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణగా ఈ చట్టాని రూపొందించారన్నారు. ఐసీడీఎస్ కోఆర్డినేటర్ కె.శారద, కె.సుధీర్‌రెడ్డి, శేఖర్, జితేంద్ర పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందుతుంది

మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



నర్సింహులపేటలోని రైతు వేదిక వద్ద రైతులతో మాట్లాడుతున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

నర్సింహులపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులెవ్వరూ అధైర్య పడవద్దని, అందరికీ యూరియా అందుతుందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు పెద్దనాగారం రైతు వేదికలలో యూరియా కూపన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. కూపన్ల పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలని యూరియా కోసం వచ్చే రైతులకు మంచినీటి వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. క్లస్టర్‌లో ఉన్న రైతులకు గ్రామాల వారీగా కూపన్లు ఇస్తే ఆలస్యం కాకుండా అందరికీ కూపన్లు అందుతాయన్నారు. జిల్లాలోని రైతులందరికీ సరిపడా యూరియా వస్తుందని ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు కృష్ణకిషోర్, మోహన్, సీఐలు గణేష్, శంకర్ నాయక్, ఎస్సైలు సురేష్, కృష్ణరెడ్డిలు పాల్గొన్నారు.

సజావుగా బస్తాల పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని వివిధ రైతు వేదికల వద్ద యూరియా కోసం తెల్లవారు జామునుంచే భారీగా క్యూలైన్‌లో నిలుచున్నారు. శనిగపురం పీఏసీఎస్ సెంటర్‌ను ఉదయం ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ సందర్శించి పలు సూచనలు చేశారు. మహబూబాబాద్ పీఏసీఎస్, శనిగపురం, ఏటిగడ్డతండా, జంగిలిగొండ, మల్యాల, వేమునూరు, అమనగల్ రైతు వేదికలకు మొత్తం 80 టన్నులు, 1776 బస్తాల యూరియాను ఆయా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేశారు. క్యూలైన్‌లో ఉండి యూరియా రాని రైతులకు పట్టా పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలపై సీరియల్ నెంబర్లు వేసి పంపించారు.

మరిపెడ పీఏసీఎస్ ఆకస్మిక తనిఖీ

● మరిపెడ: యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులు ఎగబడొద్దని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అధికారులకు, పోలీసులకు సూచించారు. మరిపెడ పీఏసీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్లు, యూరియా పంపిణీపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి యూరియా పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. యూరియా రైతులకు ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేయాలన్నారు. ఒకేసారి రైతులు ఎగబడొద్దని క్రమ పద్ధతిలో యూరియా బస్తాలను తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని, తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంట మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై సతీశ్, ఏవో వీరాసింగ్, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

మద్యం మత్తులో యూరియా లారీ డ్రైవర్

● లొకేషన్ ఆధారంగా లారీ గుర్తింపు

● వాహనాన్ని గమ్యం చేర్చిన కానిస్టేబుల్



కల్వలలో లారీని నడుపుతున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ అలీం

కేసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియాను తీసుకువస్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో మార్గమధ్యలో నిలిపి నిద్రపోవడంతో పోలీసులు ఆ లారీని తీసుకువచ్చిన ఘటన కేసముద్రంలో గురువారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి కేసముద్రం, కల్వల గ్రామాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు యూరియా బస్తాల లోడుతో ఓ లారీ బయలుదేరింది. ఉదయం కేసముద్రం విలేజికి చేరుకోవాల్సిఉండగా మధ్యాహ్నం వరకు లారీ రాలేదు. అధికారులు, పోలీసులు లారీ డ్రైవర్ నెంబరుకు ఫోన్ చేసినప్పటికీ ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు. దీంతో పోలీసులు సెల్ లోకేషన్ ఆధారంగా లారీ కేసముద్రం విలేజి దర్గా వద్ద నిలిపిఉన్నట్లు గుర్తించారు. వెంటనే వెళ్లి డ్రైవర్‌ను లేపగా మద్యం మత్తులో తూలుతున్నాడు. బ్లూకోల్ట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మాజీ సైనికుడైన కానిస్టేబుల్ ఎండీ.అలీం లారీని నడుపుకుంటూ కేసముద్రం సొసైటీ, కల్వలలో సగం చొప్పున యూరియా బస్తాలను దిగుమతి చేయించాడు. యూరియా కోసం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పోలీసులు చొరవ చూపి లారీని తరలించడంపై పలువురు అభినందిస్తున్నారు.

మహబూబాబాద్ కలెక్టర్ పేరుతో..

● నకిలీ వాట్సాప్ ఐడీ క్రియేట్‌పై కేసు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పేరుతో నకిలీ వాట్సాప్ ఐడీ క్రియేట్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 10న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పేరుతో 84926 334919 నెంబరుపై నకిలీ వాట్సప్ ఐడి క్రియేట్ చేసి కలెక్టర్ కార్యాలయం ఐడిఓసిలోని సిబ్బందికి వాట్సప్ మెస్సేజ్ చేశారని, ఈ చర్యల వలన జిల్లా పరిపాలనా విధానికి విఘాతం కలిగిందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏవో(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) కెవి పవన్ కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

బ్యారేజీలోకి 2.30లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 2.30లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 3.60 మీటర్లు ఎత్తులో ప్రవహిస్తోంది.

నారాయణగిరిపల్లిలో పెద్దపులి సంచారం..?

పౌల్ట్రీఫామ్‌లో 65 నాటుకోళ్లు మాయం

వెంకటాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మండలంలో పెద్దపులి సంచారంపై సీసీ కెమెరా రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మండలంలో పలు వాట్సాప్ గ్రూపుల్లో కూడా ఉదయం నుంచి ఈ వీడియో చక్కర్లు కొడుతోంది. మండలంలోని వెల్తుర్లపల్లి-నారాయణగిరిపల్లి గ్రామాల మధ్య ఉన్న బెల్లంకుంట సమీపంలోని పౌల్ట్రీఫామ్‌లో పులి సంచారం ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.. పౌల్ట్రీఫామ్‌లో 80 నాటుకోళ్లు ఉండగా గురువారం ఉదయం యజమాని వెళ్లేసరికి కేవలం 15 కోళ్లు మాత్రమే కనిపించాయి. అనుమానంతో సీసీ కెమెరా రికార్డును తనిఖీ చేయగా పులి సంచారంపై సాక్ష్యం వెలుగులోకి వచ్చింది. సీసీ ఫుటేజీ క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత వారం రోజులుగా సింగరకుంటపల్లి, పాపయ్యపల్లి మీదుగా మొదలైన పెద్దపులి సంచారం రామప్ప సరస్సులో ఈత వరకు సమాచారం.

ఆ తరువాత వానరగు ట్టకు వెళ్లి అక్కడినుంచి ఎల్లారెడ్డిపల్లి వరకు సంచరించి తిరిగి వెల్తుర్లపల్లి-నారాయణగిరి గ్రామా ల మధ్య సంచరిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. గత వారంరోజులుగా భయంగుప్పిట్లో ప్రజలు ఉంటున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు ఆవైపు కన్నెత్తికూడా చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏమీ లేనప్పుడు హంగామా సృష్టించే అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచారంపై సాక్ష్యం ఉన్నప్పటికీ మూగనోము వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు పులి సంచారంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై ఆంధ్రజ్యోతి అటవీశాఖ అధికారులను వివరణ కోర గా అది పెద్దపులి కాదు జంగపిల్లి అని పేర్కొన్నారు.



గాయపడిన జవాన్ అల్లెం మునేష్

మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

చత్తీస్‌గఢ్ దంతెవాడ అడవుల్లో ఘటన

బాధితుడిది తాడ్వాయి మండలం భూపతిపూర్

తాడ్వాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ అడవుల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ జవానుకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. తాడ్వాయి మండలంలోని భూపతిపూర్‌కు చెందిన అల్లెం మునేష్ అనే వ్యక్తి సీఆర్‌పీఎఫ్ 195 బెటాలియన్‌లో జవాన్‌గా పని చేస్తున్నాడు. విధులు నిర్వహిస్తున్న క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర తొలగించే క్రమంలో బాంబు పేలి రెండు కాళ్లు పోయాయి. దీంతో మునేష్ గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదం నెలకొంది. రాయపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

ఉమ్మడి తనిఖీ నివేదికను సమర్పించాలి

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

2026 మహాజాతర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ మహా జాతర అభివృద్ధి పనులుపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, గిరిజన సంక్షేమం, ఆర్ డబ్ల్యూఎస్, రెవెన్యూ, ఫారెస్ట్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించి వారంలోగా నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు శాఖల అధికారులతో 2016 మహా జాతర అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనుల టెండర్లు పూర్తి చేయాలని సూచించారు. పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మేడారం అభివృద్ధికి అందరూ సహకరించాని కోరారు. జనవరి 1లోగా పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిచాలన్నారు.

ఈ క్రమంలో ఒక్కో శాఖ అధికారులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ముందుగా పారిశుధ్య పనులపై డీపీవో దేవరాజ్‌తో మాట్లాడారు. పారిశుధ్యం తొలగింపు, చేపట్టాల్సిన పనులు, కావల్సిన కార్మికులు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మేడారం మహా జాతరకు రెండు నెలల మందు నుంచి భక్తులు తల్లులను ముందస్తు దర్శనాలు చేసుకుంటారని అన్నారు. గత జాతరకు 1.2 కోట్ల మంది భక్తులు వచ్చారని ఈ సారి 1.5 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనాలు ఉన్నాయన్నారు. అదేవిదంగా మరుగు దొడ్లు, తాగునీరు సమస్యలపై చర్చించారు. అనంతరం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు, ట్రాఫిక్ జామ్, భక్తుల భద్రత, దర్శనాలు, ప్రముఖుల విడిది, సౌకర్యాలు వంటి సమస్యల పరిష్కారానికి నివేదికలు సమర్పించాలని తెలిపారు. భక్తులకు వైద్య సేవలపై డీఎంహెచ్‌వో గోపాల్‌రావుతో మాట్లాడారు. అంతేకాకుండా అటవీ ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న భక్తులకు సిగ్నల్ సమస్యలు రాకుండా పలు చోట్ల పలు నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటుకు, ప్రధాన రహదారుల వెంబడి సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు మహేందర్ జీ, సంపత్‌రావులు, ఆర్డీవో వెంకటేష్, డీఆర్‌డీవో శ్రీనివాస్ రావు, మేడారం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వీరస్వామి, జిల్లా అధికారులు ఇంజనీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే నా బిడ్డ చనిపోయింది

● ఎంసీహెచ్ వైద్యులపై చర్యలు తీసుకోండి

● ఇంటి కొచ్చిన వైద్యాధికారులతో మృతురాలి తల్లి ఆవేదన



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఆవేదన వ్యక్తం చేస్తున్న అనిత

లింగాలఘణపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చంపక్ హిల్స్ ఎంసీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన బిడ్డ ప్రాణాన్ని కోల్పోయిందని, తన లాంటి కడుపు కోత ఏ తల్లికీ రావొద్దని డెంగీతో మృతిచెందిన ఏడేళ్ల బాలిక సంహిత తల్లి అనిత వైద్యాధికారుల ఎదుట తన ఆవేదన వెళ్లగక్కింది. లింగాలఘణపురం మండలం వనపర్తికి చెందిన సంహిత డెంగీ కారణంగా మృతి చెందగా మృతురాలి కుటుంబాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ కమల్, ఎంపీడీవో రఘురామకృష్ణ, వైద్యాధికారులు గురువారం పరిశీలించారు. డెంగీ సోకడానికి కారణాలను పరిశోధించేందుకు వనపర్తి గ్రామానికి చేరుకుని, బాధిత కుటుంబంతో మాట్లాడారు.

సంహిత తల్లి అనిత వైద్యాధికారుల ఎదుట తన ఆక్రోశాన్ని వెలిబుచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకంతో జ్వరంతో బాధపడుతున్న తన బిడ్డను ఎంసీహెచ్‌లో చేర్పించామని, వైద్యసేవల నిర్లక్ష్యంతోనే తన బిడ్డ చనిపోయిందంటూ ఆరోపించారు. వారం రోజులు ఆస్పత్రిలో ఉంటే ఒక్కరోజు కూడా బీపీ పరీక్ష చేయలేదన్నారు. బిడ్డ పరిస్థితి చేయిదాటుతుందని మరోసారి డాక్టర్‌ను అడిగేందుకు వెళ్తుండగా అమ్మాయి పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని ఎంజీఎంకు రెఫర్ చేద్దామని తనను గమనించకుండా వాళ్లకు వాళ్లే చర్చించుకున్నారని పేర్కొంది. హైద్రాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్తామని ప్రభుత్వ అంబులెన్స్‌ను సమకూర్చాలని బతిమిలాడితే, వరంగల్ ఎంజీఎంకు మాత్రమే వస్తామని హైద్రాబాద్‌కు వచ్చేదిలేదని తెగేసి చెప్పడంతో రూ. 6వేలు ఇచ్చి ప్రైవేటు అంబులెన్స్‌లో నీలోఫర్‌కు వెళ్లామన్నారు. కలెక్టర్ స్పందించి వైద్యుల నిర్లక్ష్యంపై కొరడా ఝులిపించాలని, తాను లిఖితపూర్వక ఫిర్యాదు చేయడానికి సిద్ధమని పేర్కొంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 37మందికి జరిమానా

గోవిందరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవిచి వాహనాలు నడిపిన 37మందికి రూ.40 వేల జరిమానా, మరో ముగ్గురికి మూడురోజుల జైలుశిక్ష పడినట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. ఇటీవల పస్రా సెంటర్, గోవిందరావుపేట చౌరస్తాలో పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టగా 37మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, మరో ముగ్గురు అతిగా మద్యంసేవించి ఉన్నారని అన్నారు. దీంతో వారిని గురువారం ములుగు కోర్టులో హాజరుపరచగా జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ జ్యోష్న 37మందికి రూ.40వేల జరిమానా, మరో ముగ్గురికి మూడురోజుల జైలుశిక్ష విధించినట్లు ఆయన వివరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7545	5300
మక్కలు	2221	1521
కందులు	5522	3022
పెసళ్లు	5952	3022
పల్లికాయ (సూక)	7000	3500
పల్లికాయ (పచ్చిది)	3800	2400
పసుపు (కాడి)	10668	7889
పసుపు (గోల)	10209	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14600	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

జాతీయస్థాయి క్రీడల్లో తెలంగాణ జెండా ఎగురవేయాలి

● విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● గురుకుల పాఠశాలల సెక్రటరీ సీతాలక్ష్మి



పొగుళ్లపల్లిలో మాట్లాడుతున్న సెక్రటరీ సీతాలక్ష్మి

కొత్తగూడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం జెండాను ఎగురవేయాలని, విద్యతో పాటు ఆటలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రోత్రహిస్తున్నారని గురుకుల పాఠశాలల సెక్రటరీ సీతాలక్ష్మి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి క్రీడలను గురువారం ఆమె ప్రారంభించారు. ఒలంపిక్ కాగడతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సభలో సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. రానున్న రోజుల్లో ఇండియాలో ఒలంపిక్ క్రీడలతో పాటు మరిన్ని అంతర్జాతీయ క్రీడలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అప్పటి వరకు క్రమశిక్షణ, కృషి పట్టుదలతో సాధన చేసి, క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపుతో పొంగిపోకుండా.. ఓటమితో కుంగిపోకుండా ముందుకు సాగాలని సూచించారు. పదో తరగతి తరువాత చదువుల్లో ఉత్తమ విద్యను ఏంచుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ మాధవి, స్టేట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్, ఓఎస్‌డీ శ్రీనివాస్, ఆర్సీవో రత్నకుమారి, ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు వినూత్న కోర్సులు

- ప్రైవేట్‌కు దీటుగా కొత్త బ్రాంచీలు
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాలతో ముందుకు..
- కేయూలో విద్యా సంస్కరణలు
- వర్సిటీ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ గుగులోత్ హన్మంతు





కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కేయూ పకడ్బందీగా ముందుకు సాగుతోంది. విద్యా విషయాలపై నిర్దిష్టమైన ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాబోయే రోజుల్లో విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సైన్స్, ఇంజనీరింగ్‌తో పాటు సోషల్‌సైన్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మన విద్య మార్పులను స్వాగతిస్తోంది. మార్పులను అనుగుణంగా విద్యారంగాల నిపుణులతో కలిసి వర్సిటీని మరింత ముందుకు తీసుకువేళ్ళేందుకు సిద్ధమవుతోంది. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవాల సంబురాల వేళ కొత్త కోర్సులను ప్రవేశపెడుతోంది. విద్యారంగంలో కాకతీయ యూనివర్సిటీ మైలురాయిని అందుకుని దీటుగా వెళుతోంది. కాకతీయ యూనివర్సిటీలో విద్యరంగ అంశాలను మానటరింగ్ చేస్తూ మార్పులను అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు బోధనలో నాణ్యతను పెంచేందుకు కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్ కార్యాలయం నిరంతరం సమీక్షించి పనిచేస్తోంది.

2000లో అకడమిక్ ఆడిట్ డీన్ ఏర్పాటు

కాకతీయ యూనివర్సిటీలో అకాడమిక్ అఫైర్స్‌ను సమీక్షించి పరిశీలించి దిశా నిర్దేశం చేసేందుకు 2000ల సంవత్సరంలో మార్చిలో 77వ ఈసీ నిర్ణయం మేరకు కేయూలో డీన్ కార్యాలయాలన్ని ఏర్పాటు చేశారు. మొదటి డీన్‌గా కేయూ ఫార్మసీ ప్రొఫెసర్ వి. మల్లారెడ్డి నియామితులయ్యారు. విద్యా విషయాలను కో ఆర్డినేట్ చేస్తోంది. డీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు అఫీస్ సిబ్బందిని కేటాయించారు.

కేయూ పరిధిలో కళాశాలల వివరాలు

కేయూ పరిధిలో యూజీ స్థాయిలో డిగ్రీ కళాశాలలు 290 ఉండగా పీజీ కళాశాలలు 74 ఉన్నాయి. అలాగే 6 ఇంజనీరింగ్ కళాశాలలు, 25 ఫార్మసీ, 41 ఎడ్యుకేషన్, 3 ఫిజికల్ ఎడ్యుకేషన్, 3 న్యాయ కళాశాలలు, 24 ఎంబీఏ, 7 ఎంసీఏ, 3 హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలున్నాయి. 1.65 లక్షల మంది డిగ్రీ, 12 మంది పీజీ, 2 వేల మంది ఇంజనీరంగ్ 8 వేల మంది బీఈడీ విద్యార్థులు, 600 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు, 24 వందాల మంది న్యాయ శాస్త్ర విద్యార్థులున్నారు. వీరితో పాటు 7500 మంది ఎంబీఏ, 200 మంది ఎంసీఏ, 300 మంది హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదివే విద్యార్థులున్నారు. ఏటేటా 2 లక్షల మంది విద్యార్థులు కేయూ పరిధిలో విద్యనభ్యసిస్తున్నారు.

కేయూలో వినూత్న కోర్సులివే..

కేయూలో బీఏ, బీఈడీ ఇంటిగ్రేటెడ్, ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ బీబీఏ, బీబీఎం కోర్సులను నడుస్తున్నాయి. అలాగే డేటా సైన్స్, న్యూట్రిషియన్స్, ఫారెస్టు, అగ్రికల్చర్ బెస్ట్ కోర్సులను డిగ్రీ స్థాయిలో ప్రవేశపెట్టారు. బాటనీ, కెమిస్ట్రీ, అగ్రికల్చర్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. బీఏ బీఈడీ కోర్సులను మంచిర్యాల లక్సెట్టిపేటలో ప్రవేశపెట్టారు. బీఎస్సీ కోర్సుల్లోనూ విభిన్న కాంబినేషన్స్‌లో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టారు. డేటాసైన్స్, డైట్ టిక్స్ కోర్సులకు అనుమతించారు.

కళాశాలలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం

కేయూ అకాడమిక్ అడిట్ డీన్ వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఎడ్యుకేషన్, లా, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ కళాశాలలకు ఎప్పటికప్పుడూ అల్మానాక్ విడుదల చేసి పాఠ్యాంశాల బోధన, పరీక్షల టైం టేబుల్ నిర్ణయించి సరైన దిశా నిర్దేశం చేస్తోంది. వర్సిటీ అకాడమిక్ స్టాండింగ్, అకాడమిక్ సెనేట్‌లకు సభ్యులుగాను పనిచేస్తారు. కళాశాల నుంచి వర్సిటీ చెల్లించాల్సిన ఫీజులను డిమాండ్ నోటీసులు ఇచ్చి వసూళ్ళు చేస్తోంది. నిర్ణీత సమయంలో ఫీజులు చెల్లించని కళాశాలల పెనాల్టీలను విధిస్తోంది. నామినల్ రూల్స్‌ను తయారు చేస్తోంది. కళాశాలల్లో లైబ్రరీలు, ఇతర మౌళిక సదుపాయాలను ఎప్పటికప్పుడూ పరిశీలిస్తోంది. సదుపాయాలతో ఏమైన లోటు పాట్లుంటే వెంటనే నోటీసులు జారీ చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తోడ్పాటును అందిస్తోంది.

వర్సిటీ పరిధిలో కళాశాలల తనిఖీలు

కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీలతో పాటు అన్ని అనుబంధ కళాశాల గుర్తింపును కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ కార్యాలయం అధికారులతో కలిసి అకాడమిక్ డీన్ కార్యాలయం ఇస్తోంది. కళాశాల వర్సిటీ నిర్దేశాలకు అనుగుణంగా పనిచేయకపోతే రద్దు చేసే అధికారం కలిగి ఉంటుంది. కళాశాల అధ్యాపకుల వివరాలను, అటెండెన్స్, అకాడమిక్ అడ్మినిస్ట్రేష న్‌ను తనిఖీ చేస్తోంది. క్లాస్ జరగడం లేదని, టీచర్స్ లేని కళాశాలలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

ప్రొఫెసర్ జీ హన్మంతు, డీన్, అకడమిక్ ఆడిట్



వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుకోసం పకడ్బందీగా వ్యవరిస్తున్నాం. డిగ్రీ, పీజీ, ఇతర ప్రొఫెషనల్స్ కళాశాలల్లో ఎప్పటికప్పుడూ విద్య ప్రమాణాలు పెంపుకోసం అప్రమత్తం చేస్తాం. కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడి అకాడమిక్ కరిక్యూలమ్‌ను రూపొందిస్తాం. సిలబస్ బోధన పూరైన వెంటనే విద్యా ర్థులకు పరీక్షల షెడ్యూల్ రూపొందిస్తాం. విద్యా అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు కొత్త కోర్సుల ఏర్పాటుకు అనుమతిస్తాం. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం మార్కెట్‌కు అనువైన సరైన కోర్సులు వర్సిటీ పరిధిలో అనుమతిస్తాం.



సీఎం రేవంత్ రెడ్డితో కలిసి రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేయండి

- కాజీపేటలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వండి
- భూపాలపల్లికి రైల్వేస్టేషన్, కొత్త లైన్ నిర్మించండి
- రైల్వే బైపాస్ లైన్లకు ప్రత్యామ్నాయం చూపండి
- రైల్వే అధికారులకు ఎంపీ కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టులన్నిటినీ మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులను కోరారు. గురువారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో డాక్టర్ కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు సంబంధించి రైల్వే సమస్యలను డాక్టర్ కావ్య ప్రస్తావించారు. కాజీపేటలో రైల్వేకు సంబంధించిన స్థలం బస్‌స్టాండ్ నిర్మాణానికి కేటాయిస్తే దానికి బదులుగా మరోచోట స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. ప్రజలు, రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మల్టీమోడల్ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ కోరారు. రైల్వేశాఖ మంత్రి దీనికి సంబంధించిన ఆదేశాలను కూడా జోనల్ అధికారులకు అందజేశామని వెల్లడించారు.

భూపాలపల్లికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వేలైన్ మంజూరు గురించి కూడా ఎంపీ ప్రస్తావించారు. భూపాలపల్లి సింగరేణి కాలరీస్, టీజీజెన్‌కో నుంచి బొగ్గు రవాణా చేయడానికి ట్రక్కులపై ఆధారపడుతున్నదన్నారు. రైల్వే లైన్ మంజూరైతే రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం, సరుకు రవాణా ఖర్చులు తగ్గుతాయని, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తెలిపారు. అదే విధంగా కాజీజేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రయాణం, వాణిజ్యరంగాన్ని మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. ఉద్యోగ కల్పన, వ్యాపార వృద్ధి, వరంగల్ కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో రైల్వేకు అత్యధిక రెవెన్యూ అందించబడుతుందని పేర్కొన్నారు.

నూతన రైల్వే బైపాస్ లైన్ల విషయాన్ని కూడా ఎంపీ ప్రస్తావించారు. నష్కల్ నుంచి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లైన్లు, ఒకటి నష్కల్ నుంచి చింతలపల్లి వరకు, రెండు నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు రైల్వేశాఖ ప్రతిపాదనలు చేసిందని గుర్తు చేశారు. ఓఆర్ఆర్ నిర్మాణం కారణంగా ఇప్పటికే రైతులు నష్టపోయారని అన్నారు. మరోసారి ఈ రైల్వే లైన్ల కారణంగా రైతులు మరిన్ని భూములు కోల్పోయి వ్యవసాయం చిన్నాభిన్నం కానుందన్నారు. ట్రయాంగిల్ రైల్వే విధానంతో వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అక్కడి రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులను, అధికారులను కలిశామని వెల్లడించారు.

ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, ట్రాన్స్‌పోర్టు అండ్ బిల్డింగ్స్ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

- నయీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘటన
- ఆందోళన నిర్వహించిన విద్యార్థి సంఘాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



మృతి చెందిన జయంత్ వర్ధన్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల మైదానంలో వ్యాయామం చేసి తరగతి గదిలోకి వెళుతున్న క్రమంలో గుండెపోటుకు గురైన పదోతరగతి విద్యార్థి పోలెపల్లి జయంత్‌వర్ధన్ (15) స్పృహ తప్పి కింద పడిపోయి మరణించాడు. ఈ సంఘటన గురువారం హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యారణ్యపురిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి చిన్న కుమారుడు జయంత్‌వర్ధన్ నయీంనగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. రోజూలాగే పాఠశాలకు వచ్చిన విద్యార్థి.. ఫిజికల్ ట్రైనింగ్ పీరియడ్‌లో భాగంగా గ్రౌండ్‌కు వచ్చాడు. ట్రైనర్ సమక్షంలో మిగతా విద్యార్థులతో కలిసి వ్యాయామం చేశాడు. అనంతరం గ్రౌండ్‌లో వరుసక్రమంలో నిల్చుంటున్న క్రమంలో గుండెపోటుకు గురై స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. మూర్ఛగా భావించిన పాఠశాల సిబ్బంది.. బాలుడి తండ్రి రవికి సమాచారం అందజేసి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లుగా వైద్యులు వెల్లడించారు.

కాగా, విషయం తెలుసుకున్న విద్యార్థిసంఘాలు పాఠశాల వద్దకు చేరుకున్నాయి. యాజమాన్యం నిర్లక్ష్యంగా కారణంగానే విద్యార్థి మృతి చెందాడని పాఠశాల ఎదుట అందోళన నిర్వహించారు. విద్యార్థి ఆయాసపడుతుంటే పట్టించుకోకుండా బలవంతంగా వ్యాయామం చేయించారని ఆరోపించారు. విద్యార్థి చెవి నుంచి రక్తస్రావం జరిగినట్లుగా కనబడుతోందని, దానిపై విచారణ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఈవో, కలెక్టర్‌ను కోరారు. ఇదిలా వుండగా, పాఠశాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు సతీష్, పరుశురాములు, సదానందం, ఏఎస్సై రఘునాథ్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కాగా, తన కుమారుడిని ఆస్పత్రికి తరలించడంలో పాఠశాల యాజమాన్యం జాప్యం చేయడం వల్లనే మరణించాడని మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఈవో కార్యాలయం వద్ద ధర్నా

వరంగల్ ఎడ్యుకేషన్: విద్యార్థి మృతికి కారణమైన ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా..

- ఓరుగల్లు పల్లెల్లో మొదలైన బొడ్డెమ్మల సందడి
- బతుకమ్మకు ముందు తొమ్మిది రోజుల వేడుక

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతానికే తలమానికంగా బాసిల్లుతూ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న సాంస్కృతిక పర్వం బతుకమ్మ. ఆ బతుకమ్మ పర్వానికి కచ్చితంగా తొమ్మిది రోజుల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభమయ్యే వేడుకే బొడ్డెమ్మల పర్వం. భాద్రపద బహుళ పంచమి అయిన గురువారం నుంచి బొడ్డెమ్మల పర్వానికి శ్రీకారం చుట్టారు. ఆధునికత ఎంత పెరిగినా పట్టణ ప్రాంతాలు సహా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం విశేషం. బొడ్డెమ్మలు మహాలయ అమావాస్య వరకు అంటే బతుకమ్మ పండగ తొలినాటి వరకు జరుపుకొని బొడ్డెమ్మలను నిమజ్జనం చేసి బతుకమ్మలకు శ్రీకారం చుడుతారు. పెళ్లిగాని యువతులు, పిల్లలు వారితో పాటు ముత్తైదువలు బతుకమ్మ పర్వానికి ఎంతో ప్రాధాన్యమిస్తారో ఈ బొడ్డెమ్మకు కూడా అదే ప్రాధాన్యంతో ఆడుకోవడం విశేషం.

బొడ్డెమ్మ అంటే..

బొడ్డెమ్మ అంటే ధాన్యరాశి, ధాన్యపు కుప్ప అని వాడుకలో ఉంది. బొడ్డెమ్మను పుట్ట మట్టితో అందంగా పేర్చి చెక్కపీటపై చతురస్రాకారంగా ఐదు దొంతరలుగా పేర్చి ఒకదానిపై ఒకటి త్రిభుజాకారంగా పేరుస్తారు. బొడ్డెమ్మను ఉద్రాక్ష, కాకర, కట్ల, బీర, మల్లి, జాజిపూలతో అలంకరిస్తారు. ఆ తరువాత శిఖర ప్రదేశాన బియ్యంతో నిండిన చిన్న కలశం, కొత్త వస్త్రం పెడతారు. తమలపాకు, పసుపు గౌరమ్మను ఉంచుతారు. సాయంకాలం ఇంటి ముందు అలికి ముగ్గులు పెట్టి ఒక్కోవాడకు ఒక్కరి చొప్పున అన్నట్లుగా గ్రామీణ ప్రాంతాల్లో బొడ్డెమ్మను నిలుపుతారు. ఇరుగు పొరుగు వారు, కన్నెపిల్లలు వచ్చి చప్పట్లు కొడుతూ బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటల పాడుతారు. బతుకమ్మ పాటల మాదిరిగా బొడ్డెమ్మా.. బొడ్డెమ్మా వలలో.. బిడ్డాలెందరో వలలో.. అంటూ బొడ్డెమ్మల పాటలు కూడా ప్రత్యేకంగా పాడుకుంటారు. తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మను ఆడుకొని అమావాస్యకు ముందురోజు బొడ్డెమ్మను నిద్రబుచ్చి నీటిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ.

తొమ్మిది రోజులు.. ఆటపాటలు

తొమ్మిది రోజులు ఆటపాటల అనంతరం బొడ్డెమ్మను అందంగా అలంకరించి రాగి చెంబులో పోసిన బియ్యం, పప్పు, బెల్లం దినుసులను నైవేద్యంగా తయారు చేసి అందరికి ప్రసాదంగా పంచి చెరువులు, కుంటలు, బావుల్లో గాని బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ నిమజ్జనం ముగిసిన మరుసటి రోజు నుంచి బతుకమ్మ ప్రారంభమవుతుంది.

ఉమ్మడి జిల్లాలో..

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో బొడ్డెమ్మల సాంస్కృతిక పర్వం ప్రారంభమైంది. హనుమకొండ రాగన్న దర్వాజలో కూడా ప్రతియేటా ఆనవాయితీగా మాదిరిగా రజక సంఘం ఆధ్వర్యంలో బొడ్డెమ్మల వేడుకకు శ్రీకారం చుట్టారు. నగరాల్లోనూ అనేక చోట్ల బొడ్డెమ్మలకు శ్రీకారం చుట్టారు. ప్రాచీన సంస్కృతికి నిదర్శనంగా ఈ వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకం. అందునా ప్రత్యేకించి వరంగల్ జిల్లా బతుకమ్మ, బొడ్డెమ్మ ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండడం విశేషం.



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

ప్రాచీన పండుగకు ప్రభుత్వ ఆదరణేదీ ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రాచీన పండుగలకు గుర్తింపు ఇచ్చిన ప్రభుత్వం బొడ్డెమ్మ పండుగను గుర్తించకపోవడం వలన పల్లెల్లో పండుగ ప్రాబల్యం తగ్గిపోతోంది. శాస్త్రీయంగా సైన్స్ పరంగా జరుపుకునే వేడుకల్లో బొడ్డెమ్మ ఒకటి. బొడ్డెమ్మ పండుగను ప్రభుత్వం గుర్తించి గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టులపై గందరగోళం

- అర్హతల ప్రాతిపదికపై అయోమయం
- నోటిఫికేషన్‌లో పీపీటీ కోర్సు మాత్రమే ప్రస్తావన
- గడువు ముగిశాక స్థానికతపై మెలిక
- విద్యా శాఖ నుంచి స్పష్టత కరువు



హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీస్కూల్) తరగతులకు తాత్కాలిక ప్రాతిపదికపై ఇన్‌స్ట్రక్టర్ (టీచర్), ఆయాల నియామకం ప్రక్రియ గందరగోళంగా మారింది. పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రకటనలో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు ప్రీ ప్రైమరీ బోధనకు సంబంధించిన ట్రైనింగ్/సర్టిఫికెట్ (మాంటిస్సోరీ, ఈసీసీఈ లేదా తత్సమానమైన కోర్సు) సర్టిఫికెట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. దీంతో అర్హత గల అభ్యర్థులందరు వాటిని సమర్పించారు. దరఖాస్తుల దాఖలు ఈనెల 2వ తేదీన ముగిసింది. హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో 45 ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, 45 ఆయా పోస్టులకు గాను మొత్తం 1313 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అయితే ఇన్‌స్ట్రక్టర్ అర్హతల ప్రాతిపదిక విషయంలో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. నోటిఫికేషన్‌లో పీపీటీ సర్టిఫికెట్ లేదా తత్సమాన అర్హత ఉండాలని పేర్కొనగా, తాజాగా డీ.ఎడ్ కూడా ఉండాలని ఆయా హెచ్ఎంలు చెబుతున్నట్లు అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. దీంతో ప్రీప్రైమరీ కోర్సు మాత్రమే చేసి, దరఖాస్తు చేసిన వారు అయోమయం చెందుతున్నారు. వాస్తవానికి ప్రీ స్కూల్ తరగతులకు పీపీటీ సర్టిఫికెట్ సరిపోతుందని, ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు వారే అర్హులని, నోటిఫికేషన్‌లో కూడా అదే ఉందని విద్యానిపుణులు చెబుతున్నారు. డీ.ఎడ్, బీ.ఎడ్ చేసిన వారు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైనందున వాటిని పరిగణనలోకి తీసుకోరని అంటున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు స్పష్టతనివ్వాల్సి ఉంది.

ఇదిలావుండగా, ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత తాజాగా స్థానికత (లోకల్) సర్టిఫికెట్లను సమర్పించాలని చెబుతుండటంతో అభ్యర్థులు అయోమయానికి లోనవుతున్నారు. అధికారులు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న క్రమంలో దరఖాస్తుదారులు స్థానికులేనని నిర్ధారణకు రావడం ఎలా అన్న సందేహం వచ్చింది. ఎంపిక ఒకే నివాసం, ఒకే గ్రామ పంచాయతీ, ఒకే మండలం, ఒకే జిల్లావారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు గానీ, నిర్దిష్టంగా లోకల్ సర్టిఫికెట్ సమర్పించాలని ఎక్కడా పేర్కొనలేదు. దీంతో దరఖాస్తుదారులెవరూ లోకల్ సర్టిఫికెట్ దాఖలు చేయలేదు. దరఖాస్తుదారు ప్రీ ప్రైమరీ స్కూల్ ఉన్న ప్రాంత పరిధి వారేనా.. అన్నది నిర్ధారించడానికి లోకల్ సర్టిఫికెట్ సమర్పించాలన్న నిబంధన తాజాగా విధించారు. సంబంధిత ఎంఈవోలతో సమావేశమైన డీఈవోలు దరఖాస్తుదారుల నుంచి ఈ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందిగా తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఈ నెల 15 తేదీ వరకు గడువు విధించారు. అయితే ఈ కొత్త నిబంధన గురించి చాలా మంది దరఖాస్తుదారులకు తెలియదు. సర్టిఫికెట్ దాఖలు చేయాలని అధికారులు పత్రికా ప్రకటన కూడా చేయలేదు. ప్రధానోపాధ్యాయులు దరఖాస్తుదారు లకు స్వయంగా ఫోను చేసి, వ్యక్తిగతంగా సమాచారం అందజేసి సర్టిఫికెట్లను సేకరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

ఎంపిక కమిటీ

ప్రీ ప్రైమరీ తరగతుల ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల ఎంపిక ప్రక్రియను కలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ చేపడుతుంది. ఈ కమిటీలో కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్, డీఈవో, సీడీపీవో సభ్యులుగా ఉంటారు. ఎంపికలో స్థానికతకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. స్థానిక అభ్యర్థి లేని పక్షంలో సమీప ప్రాంతాలకు చెందిన వారిని ఎంపిక చేస్తారు. హనుమకొండ జిల్లాలో 45 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఉండగా, ఒక్కో పోస్టుకు సగటున 45 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఆయా (హెల్పర్) పోస్టుల పట్ల ఎవరూ అంతగా ఆసక్తి చూపినట్లు లేదు. ఒక్కో పోస్టుకు 3 నుంచి 4 దరఖాస్తులే వచ్చాయి. వేతనం మరీ నెలకు రూ. 6 వేలే ఉండడంతో ఎక్కువ మంది ముందుకు రానట్లు తెలిసింది.

యూరియా అందక పంట పశువులకు..

ఖానాపురం మండలంలో ఓ రైతు ఆవేదన



గొల్లగూడెంతండాలో పంటను మేస్తున్న గొర్రెలు

ఖానాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా దొరకక అన్నదాత అరిగోస పడుతున్నాడు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు సంమృద్ధిగా కురిసి వాతావరణం అనుకూలించడంతో దండిగా పంటలు పండించుకుని నాలుగు రాళ్లు వెనకేసుకుందామనుకున్న రైతుల ఆశలను యూరియా కొరత అడియాసలు చేస్తోంది. వరి, మొక్కజొన్న పంటలను సాగుచేసిన రైతులకు రెండునెలలుగా రాత్రింబవళ్లు క్యూ లైన్లలో బారులు తీరినప్పటికీ యూరియా దొరకడంలేదు. అదనుకు యూరియా దొరకపోవడంతో పంటలు ఎర్రబడిపోతున్నాయి. చేసేదేమీలేక రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. లక్షల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంట యూరియా దొరకక ఎదుగూబొదుగూ లేకపోవడంతో పశువులకు, గొర్రెలకు మేతగా మార్చుతున్నారు.

ఈ క్రమంలో ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండాకు చెందిన తేజావత్ శ్రీను.. తనకున్న 5 ఎకరాలు భూమిలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ఇంతలోనే యూరియా కష్టాలు మొదలయ్యాయి. దీంతో రెండు నెలలుగా యూరియా కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. కానీ, ఎక్కడా అతడికి ఒకటి, రెండు బస్తాలకు మించి దొరక లేదు. వేసిన పంట అదను దాటిపోతున్నది. దీంతో అతడు తన వద్దనున్న యూరియాను కేవలం ఎకరాకు మాత్రమే వినియోగించుకున్నాడు. దీంతో మిగిలిన 4 ఎకరాలకు యూరియా వేయకపోవడంతో చేనంతా ఎదుగుదల లేకుండా ఎర్రబారిపోయింది. నిశ్చేష్టుడైన రైతు.. గురువారం తన 4 ఎకరాల మొక్కజొన్న పంటలో గొర్రెల మందను మేపాడు. ఇదేవిధమైన పరిస్థితుల్లో అనేకమంది రైతులు ఉన్నారు. ఇలాంటి సంఘటనలు యూరియా కష్టాలకు అద్దం పడుతున్నాయి.

సాగు కోసం రూ. 5 లక్షల అప్పు చేశా :

తేజావత్ శ్రీను, రైతు



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయడానికి రూ.5లక్షల అప్పు చేశాను. ఒక ఎకరాకే యూరియా అందింది. నాలుగు ఎకరాలకు యూరియా దొరకకపోవడంతో మొక్కజొన్న పెరగలేదు. అంతా ఎండుముఖం పట్టింది. పీచు మాత్రమే తొడింది. గింజ రాలేదు. దీంతో చేసేదేమీ లేక గొర్రెల మందను మేపాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకు పసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబరు 12: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ములుగు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025

అలసత్వం వహిస్తే చర్యలు

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



వైద్యాధికారితో మాట్లాడుతున్న కలెక్టర్

మహదేవపూర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టు వైద్యుల జీతాల్లో కోత విధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల హాజరుపట్టిక, డయాలసిస్ కేంద్రం, జనరల్ వార్డును, బ్లడ్ స్టోరేజీ యూనిట్‌ను తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

- నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా..
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నా రు. గురువారంనియోజకవర్గంలోని భూపాలపల్లి, గణపురం మండలాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. అలాగే భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో గ్రామస్థులు సీసీ కెమెరాల ఏర్పాటు చేయగా వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.390 లక్షల వ్యయంతో వివిధ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో రూ.20లక్షల రోడ్డు నిర్మాణ పనులు, ఎస్ఎం కొత్తపల్లి నుంచి దొమ్మటిపల్లి చెరువు వరకు రూ.1కోటి , గొర్లవీడు గ్రామంలో జడ్పీ రోడ్డు నుంచి మల్లయ్యపల్లి వరకు రూ.20లక్షల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మోరంచపల్లిలో కూడా రూ.20లక్షల రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా నేరాల నియంత్రణలో భాగంగా గొర్లవీడు గ్రామంలో సీసీ కెమెరాలను గ్రామస్థులు దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగా వాటిని ప్రారంభించారు. అయితే నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. దొంగతనాలు, నేరాలు జరగవని అన్నారు. ఈ క్రమంలో పోలీసులకు కూడా దుండగులను పట్టుకోవడంలో మార్గం సులువుగా ఉంటుందని అన్నారు. పోలీసులు నేరాల నియంత్రణ కోసం కృషి చేస్తున్నారని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటును పోలీసులు గ్రామస్థులను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకుమట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమ ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు. కుందనపల్లి శివారులోని చలివాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులకు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఆరెపల్లి కు చెందిన గజ్జి కుమార్, ఆకినపల్లికు చెందిన బండి రఘులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి ట్రాక్టర్ల ఓనర్లు అయిన మహేందర్, సురేం దర్‌రెడ్డిలతో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లఘించి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు జిల్లా ఉద్యోగులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు జిల్లా ఉద్యోగులు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో క్రీడలో టేకుమట్ల ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, కబడ్డీ క్రీడలో ఫిజికల్ డైరెక్టర్ సరస్వతి, వాలీబాల్ క్రీడకు గాను ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి, మహాముత్తారం నుంచి మమత, పెద్దాపూర్ నుంచి పాపి కొండలు, విజయలక్ష్మి, పూర్ణిమ, మహదేవపూర్ నుంచి మమత, డిప్యూటీ రేంజ్ అధికారి రమేష్, చెస్ క్రీడకు కోమలత, స్పందన, ఎల్కేశ్వరం తదితరులు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. కాగా గురువారం వారిని అభినంది ంచిన ట్లు రఘు తెలిపారు. జిల్లాకు జాతీయస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల ఆహ్వానం

ములుగు టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిదో తరగతి విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో తొమ్మిదవ తరగతి ప్రవేశం పొందడానికి, పదో తరగతి విద్యార్థులు పదకొండో తరగతి ప్రవేశం కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు విద్యాశాఖ అధికారి కె.సిద్దార్థ రెడ్డి, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం సూచించారు. అక్టోబర్ 23లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన లక్ష్మణ్‌బాబు



కేటీఆర్‌తో లక్ష్మణ్‌బాబు తదితరులు

ఏటూరునాగారం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు ములుగు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను కేటీఆర్‌తో చర్చించార ప్రజల పక్షాన పోరాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. లక్ష్మణ్ బాబు వెంట ములుగు జిల్లా సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ బాబు తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా సింగరేణి క్రీడలు..

- బాడీ బిల్డింగ్, వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలు
- ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్



వెయిట్ లిఫ్టింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో సింగరేణి మినీ ఫంక్షన్‌హాల్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడా పోటీలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. భూపాలపల్లి ఏరియా, రామగుండం-3 ఏరియాల్లోని క్రీడాకారులు పాల్గొని బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముఖ్య అతిథిగా ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణిలోని డబ్ల్యూపీఎస్ అండ్‌జీఏ క్రీడలు ప్రతీ ఒక్కరిలో ఒక సెలబ్రేషన్‌లా నిలుస్తాయన్నారు. మహిళా ఉద్యోగులు సైతం క్రీడల్లో రాణించాలన్నారు. సింగరేణి చరిత్రలోనే తొలిసిరాగా మైనింగ్, ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ విభాగాల్లో గణనీయంగా మహిళా ఆఫీసర్లు నియమితులయ్యారని గుర్తు చేశారు. వారంతా పురుషులతో సమానంగా భూగర్భ గనుల్లో పనులు చేస్తున్నారని ప్రశంసించారు. సింగరేణిలో ప్రతీ యేడాదిలాగే ఈ క్రీడలు నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మరుతి, క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, స్పోర్ట్స్ సూపర్వైజర్ శ్రీనివాస్, సీఎంఓఏఐ ప్రతినిధి నజీర్, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ బండ్ చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేయాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ములుగు టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని బతుకమ్మ బండ్ చుట్టూ రైలింగ్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోగిల మహేష్, యువజన నాయకులు జాటోత్ గణేశ్‌లు గురువారం మునిసిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జనగం సంపత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ జరుగుతున్న క్రమంలో బతుకమ్మ విగ్రహం పక్కన ఉన్న మెట్ల పైకి నీరు చేరుకోవడం వల్ల మహిళలు బతుకమ్మలు వేసే క్రమంలో, మెట్ల పైకి ఎక్కే క్రమంలో ఇబ్బందులకు గురి అవుతున్నారని వారి సౌలభ్యం కొరకు రైలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

కృష్ణకాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన చేపట్టిన ఘటన సుభాష్‌కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన అల్లి రమ్య తన భర్త సంతోష్‌తో గొడవలు జరిగి ఎల్‌బీనగర్లోని తల్లిగారింటి వద్ద ఉంటోంది. గత 9 ఏళ్లుగా తనను, తన కుమార్తెను పట్టించుకోకుండా భర్త నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ గురువారం భర్త ఇంటికి వచ్చి ఇంటి ముందర కోర్చొని న్యాయం చేయాలంటూ కుమార్తెతో కలిసి ఆందోళనకు దిగింది.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

వాజేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్‌కు ఆదివాసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమంగా లంబాడాలు చొరబడి ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు, ఏవీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బోడెబోయిన సురేష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు చేప లక్ష్మణరావు, నాయకులు చింతా కార్తీక్ తోరెం సంతోష్, ఎర్రం హరినాథ్, వాసం సంతోష్ కుమార్, మడే రవి, సంద్ర సోమరాజు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ములుగు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల సమస్యలు పరి ష్కరించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూరియ సమస్యతో రైతులు అవస్థలు పడుతున్నారని, రబీ పంటలో వడగండ్ల వానతో జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇస్తామని పేర్కొని మొత్తంగా 2993 ఎకరాలకు 5.72 కోట్ల రూపాయలు మంజూరైన రైతుల ఖాతాలో నేటికి జమ కాలేదని, యాసంగి ధాన్యానికి బోనస్ డబ్బులు చెల్లించలేదని ప్రభుత్వం చొరవ చూపి రైతుల సమస్యలను త్వరితగిన పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్, తెలంగాణ రైతు సంఘం నాయకులు కలువాల రవీందర్, కుర్ర రాజు, కొట్టెం కృష్ణారావు, రాంచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు, గురుకుల సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. గురువారం మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు జరిపి మందులు పంపిణీ చేశారు. గురుకులంలో పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన భోజనం ఉండేలా చూడాలని కోరారు. విద్యార్థులు చేతుల శుభ్రత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలన్నారు. ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎం ప్రీతి, ఆశా కార్యకర్తలు పద్మ, లలిత తదితరులు ఉన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో వైద్య శిబిరాలు



తిప్పాపురంలో వృద్ధురాలికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భాస్కర్

వెంకటాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన తిప్పాపురం, సీతారామపురంలలో మాతా, శిశు సంరక్షణ వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ భాస్కర్ 32మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా ఇద్దరు గర్భిణులను పరీక్షించి ఆరోగ్య సూచనలు చేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు. శిబిరాల్లో హెచ్‌ఈవో కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఏఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్తలు నాగమణి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించాలి

వెంకటాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక లారీల రవాణా కోసం అప్రోచ్ రోడ్డు నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు గురువారం మండలంలోని రామచంద్రాపురం గుడిగుట్టల సమీపంలో కుంగిపోయిన కల్వర్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికలోడుతో ప్రయాణిస్తున్న ఇసుక లారీలతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని, గతంలో ఎదిర చల్ల వాగుపై ఉన్న బ్రిడ్జి కుంగిపోయి భద్రాచలం-వెంకటాపురం రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం గుడిగుట్టల వద్ద ఉన్న కల్వర్టు కూలిపోయే ప్రమాదం ఉందని, ఇసుక లారీల రవాణా కోసం అప్రోచ్‌రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే లారీలు అడ్డుకుంటామని హెచ్చరించారు.

భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్‌లతో కలిసి సాదాబైనామా దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, భూపరమైన వివాదాలు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని, అందులో ఎన్ని నోటీసులు జనరేట్ చేసి సర్వే ప్రక్రియ పూర్తిచేశారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, పెండింగ్‌కు గల కారణాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో లాగిన్‌లో ఉన్న విరాసత్, మిస్సింగ్ సర్వే నంబర్లు పేరు, సర్‌నేమ్, తదితర దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలన్నారు. భూభారతి దరఖాస్తుల్లో నమోదవుతున్న సాదా బైనామాలు, నేషనల ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, గ్రీవెన్స్ దరఖాస్తులు, వాటి పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నర్సింగరావు మృతదేహం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యతో గొడవ పడి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు , బంధువులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నూరి నర్సింగారావు(28) కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలో నివసిస్తున్నాడు గురువారం రాత్రి 8 గంటల సమయంలో మద్యం మత్తులో భార్య భర్తలు ఇద్దరు గొడవపడగా మనస్తాపంతో నర్సింగా రావు తన ఇంటి వద్ద నే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అంబులెన్స్ ద్వారా హుటాహుటిన కన్నాయిగూడెంలోని పీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఎమర్జెన్సీ చికిత్స అందించి, సీపీఆర్ చేసిన పల్స్ , బ్రీతింగ్ లేక పోవ డంతో అంబులెన్స్ ద్వారా ఏటూరునాగారం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య దివ్యతో పాటుగా ఐదేళ్ల లోపు ఇద్దరు కూతుళ్లు ఖుషి, రిషిత ఉన్నారు.

ఈ గోస తీరేదెన్నడు..?

(5వ పేజీ తరువాయి)

మరో 220యూరియా బస్తాలను కూపన్లు ఇచ్చి పంపిణీ చేశారు. ఎరువుల బస్తాలు అందుబాటులోకి రానున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని డీఏవో బాపురావు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో సతీష్, ఏఈవోలు ఆస్మా, రాజన్న తదితరులు ఉన్నారు.

●మల్హర్ : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. గురువారం మండలంలోని కొయ్యూర్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి రెండు వందల యూరియా బస్తా లు రాగ సుమారు మూడు వందల మంది వరకు రైతులు అక్కడికి చేరుకున్నారు. పోలీస్ పహర నడుమ రైతులకు బస్తాల పంపిణీ టోకెన్లు ఇచ్చారు. రెండు గంటల నిరీక్షన అనంతరం రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేశారు.

సైన్స్ సెమినార్‌లో నూతన ఒరవడిని సృష్టించాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు నూతన ఒరవడిని సృష్టించాలని జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి విద్యార్థులకు సూచించారు. గురువారం భూపాలపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్వాంటం బిగిన్స్, పొటెన్షియల్ చాలెంజ్ అనే అంశాలపై ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులు ప్రాజెక్టులను తయారుచేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి స్వామి ముఖ్యఅతిధిగా హాజరై ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో కాళేశ్వరం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అన్నపూర్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, బయో సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జూరీ సభ్యులు రాజేంద్రప్రసాద్, స్వామి పాల్గొన్నారు.

చింతగూడెం పాఠశాలకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

కన్నాయిగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విదులు నిర్వహిస్తున్న శ్రీనివాస రెడ్డి పాఠశాల విద్యార్థుల కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవలే విదుల్లో చేరిన శ్రీనివాస రెడ్డి పాఠశాలలో తాగు నీటి కోసం తన సొంత డబ్బులతో 30 వేల విలువ చేసే ఆర్వో ప్లాంటు భహూకరించి గురువారం పాఠశాలలో పిట్ చే యించారు. గ్రామస్థులు ,పలువురు ఉపాధ్యాయున్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు ముందు విద్యార్థుల అభివృద్ధి కై చక్కటి సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. అందుకు గాను గ్రామంలోని బడి ఈడు పిల్లలు అందరిని బడిలో చేర్పించాలని అందుకు తల్లి తండ్రులు సహకరించాలని కోరారు. ఉపాధ్యా యులు సతీష్, నర్సింహులు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

వెంకటాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విష జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావాన్ని తెలుసుకోవడానికి వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ టైఫాయిడ్, డెంగీ, మలేరియా, విరోచనాలు, తదితర సీజనల్ వ్యాధుల గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అనంతరం వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధలబారిన పడకుండా గ్రామస్థులు తగిన జాగ్రత్తపడాలని, కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, దోమతెరలు వాడాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది వీధుల్లో దోమలమందు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం గొల్లవాడలో వైద్యశిబిరం నిర్వహించి 50మందిని పరీక్షించారు. ఇందులో ఇద్దరు జ్వరపీడితులకు మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేసి వారికి వ్యాధులు లేవని గుర్తించారు.

నౌకరిపై నల్ల సూరీల నిర్లక్ష్యం.!

(5వ పేజీ తరువాయి)

ఇతర అధికారులు ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గనుల వారిగా నిత్యం గైర్హాజరవుతున్న కార్మికుల లిస్టును తయారు చేసి వారివారి కుటుంబీకుల సమక్షంలో కౌన్సిలింగ్‌లు ఇస్తున్నారు. ప్రతీ గనిపై మూడు నెలలకోమారు ఆయా గనుల మనేజర్ల నేతృత్వంలో ఇస్తుండగా యేడాదికి రెండుమార్లు ఏరియా జీఎం నేతృత్వంలో స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినప్పటికి చాలా మందిలో మార్పు రావడం లేదు. కౌన్సిలింగ్ సమయంలో వివిధ కారణాలను ఎత్తి చూపుతూ ఆ రోజు గట్టెక్కుతూ వస్తున్నారు. గైర్హాజరు ఫలితంగా దీంతో సింగరేణి ఏరియాలో ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరగడం లేదు. గడిచిన ఆగస్టు మాసంలో ఏరియాలో 73 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి సాధ్యమైంది. ఏరియాలో మెత్తంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2.75 లక్షల టన్నులు కాగా, 2.02 లక్షల టన్నులు బొగ్గును వెలికితీయగలిగారు.

- ఉద్యోగం అదృష్టంగా భావించాలి
- రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి ఏరియా జీఎం

సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం యువత అదృష్టంగా భావించాలి. చాలా మంది యువత గైర్హాజరవుతుండటం సరికాదు. పద్ధతి మార్చుకోకపోతే ఉద్యోగం నుండి తొలగించాలనే ప్రక్రియ సైతం సంస్థ మొదలు పెట్టింది. ఇకనైనా కార్మికుల్లో మార్పు రావాలి. ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియాను ముందు వరసులో ఉంచేందుకు అధికారులు, కార్మికులంతా సహకరించాలి.

ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



కాటారంలో అమరులకు నివాళులర్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ములుగు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అటవీ శాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ ఆధ్వర్యంలో అటవీ ఉద్యోగులు నివాళులు అర్పించి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాలను ములుగు అటవీశాఖ కార్యాలయంలో, ఏటూర్‌నాగారం అటవీ కార్యాలయంలో నిర్వహించారు. 61 మంది అటవీ సిబ్బంది రక్తదానం చేశారు.

● కాటారం :మండలకేంద్రంలోని కాటారం రేంజ్ కాంప్లెక్స్ ఆవరణలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది గురువారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిపారు. కాటారం, పెగడపల్లి రేంజ్‌లకు సంబంధించిన రేంజర్లు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు సిబ్బంది అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల ఆత్మశాంతి కోసం 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కాటారం నుంచి పెగడపల్లి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పెగడపల్లి ఎఫ్ఆర్వో వెంకటేశ్వర్‌రావు, కాటారం, యామన్‌పల్లి, బోర్లగూడెం డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్. లాయక్‌హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు అర్చన, లక్ష్మణ్‌రావు, సంతోష్, ఇర్షాద్‌బేగ్, హుస్సేన్‌ఖాన్, ఫయాజ్, ఎఫ్‌బీవోలు రాజేందర్, సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.